సాక్షి విశాఖపట్నం

ఆదివారం | 3 | ఆగస్టు | 2025



16 స్వీట్ షాపులపై కేసుల నమోదు 8లో



పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు 8లో



ఆటో మ్యుటేషన్ ప్రక్రియ సజావుగా సాగాలి 8లో

న్యూస్‌రీల్

స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది



అల్లిపురం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు ఉన్నారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థాయీ సంఘం ఎన్నికలకు 21 నామినేషన్లు దాఖలయ్యాయని, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవటంతో ఎన్నికల బరిలో 20 మంది సభ్యులు నిలిచారని పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన స్థాయీ సంఘం ఎన్నికలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయన్నారు. అదే రోజు ఫలితాలను ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

విశాఖలో నర్సుల రాష్ట్ర ద్వైవార్షిక సదస్సు

సెప్టెంబర్ 19, 20 తేదీల్లో నిర్వహణ



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్ఏఐ) 31వ రాష్ట్ర ద్వైవార్షిక సదస్సు సెప్టెంబరు 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో జరగనుంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్. షంషేర్ బేగం శనివారం నగరంలోని ఒక హోటల్‌లో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 'లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో–ది జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్'అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఏయూ కాన్వొకేషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఏపీ నర్సెస్ అండ్ మిడ్‌వైఫరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల, గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి, కౌన్సిల్ సభ్యురాలు, నర్సింగ్ ఎడ్యుకేషన్ అధ్యక్షురాలు డి.ఉష పన్నాగవేణి పాల్గొన్నారు.

స్పెషల్ రైళ్లు పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరి కొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–తిరుపతి(08547) వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ బుధవారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబరు 24వ తేదీ వరకు పొడిగించారు. తిరుపతి–విశాఖపట్నం(08548) స్పెషల్ తిరుపతిలో ప్రతీ గురువారం రాత్రి 9.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు సెప్టెంబరు 25 వరకు పొడిగించారు. విశాఖపట్నం–చర్లపల్లి(08579) వీక్లీ స్పెషల్ ప్రతీ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు సెప్టెంబరు 26 వరకు పొడిగించారు. చర్లపల్లి–విశాఖపట్నం(08580)స్పెషల్ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు సెప్టెంబరు 27వ తేదీ వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

మహారాణిపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత తపాలా శాఖ 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం పలు పోటీలను నిర్వహించనుంది. సెయింట్ ఆంథోని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఈ నెల 5, 6, 11, 12 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎలాంటి ప్రవేశ రుసుం లేదు. ఈ నెల 5, 11 తేదీల్లో 'అందమైన విశాఖపట్నం'అనే అంశంపై జరిగే డ్రాయింగ్ పోటీలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ నెల 6, 12 తేదీల్లో 6,7 తరగతుల విద్యార్థులకు పోస్ట్ కార్డు పోటీ నిర్వహించనున్నారు. విశాఖపట్నం నగరాన్ని మరింత అందమైన, అభివృద్ధి చెందిన నగరంగా ఎలా మార్చాలి? అనే అంశంపై ఈ పోటీ ఉంటుంది. ఈ నెల 6, 12 తేదీల్లో 'విశాఖ నగరాన్ని పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఎలా మార్చాలి?'అనే అంశంపై జరిగే ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డు పోటీల్లో 8,9,10వ తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మనోజ్ (90789 79079), సాయి మనోజ్ (97030 34001)ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

స్నేహగీతం





జీవన ప్రయాణంలో మనకు లభించే అత్యంత విలువైన బహుమతుల్లో స్నేహం ఒకటి. ఇది కేవలం ఒక పదం కాదు. ఎన్నో భావోద్వేగాల సమాహారం. మన భావాలను, ఆలోచనలను ఎలాంటి హద్దులు లేకుండా పంచుకోవడానికి దీనికి మించిన వేదిక లేదు. అమ్మ ప్రేమ తర్వాత అంతటి ఆత్మీయతను, భద్రతను ఇచ్చే ఏకైక బంధం స్నేహం. కష్టంలో నేనున్నానంటూ ధైర్యాన్నిచ్చే భరోసా.. సంతోషంలో మనతో కలిసి నవ్వే ఆనందం.. ఎలాంటి స్వార్థం లేకుండా మన మేలు కోరే నమ్మకం.. ఇవన్నీ కలగలిపితేనే నిజమైన స్నేహం. అందుకే ఎన్ని బంధాలున్నా.. స్నేహబంధానికి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది.

స్నేహానికి కొత్త అర్థం 8లో ముదిమిలో వికసించిన స్నేహ కుసుమాలు



నగరంలో సందడి

ఆగస్టు మొదటి ఆదివారం రానే వచ్చింది. స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడానికి విశాఖ యువత సిద్ధమైంది. తమ ఆప్తమిత్రులకు, చిన్ననాటి స్నేహితులకు శుభాకాంక్షలు చెప్పి, చేతికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టడంలో ఉండే ఆనందమే వేరు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, పాలబూత్ సెంటర్, సీతంపేట, రామాటాకీస్, శంకరమఠం మెయిన్‌రోడ్, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద యువతీయువకులు రంగురంగుల, ఆకర్షణీయమైన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను కొనుగోలు చేశారు. - సీతంపేట

అధికారులకు అగ్నిపరీక్ష



జిల్లాలో 73,452 బంగారు కుటుంబాల గుర్తింపు | **మార్గదర్శుల కోసం అధికారులు ముప్పతిప్పలు**

మహారాణిపేట: పేదలను ఉన్నత స్థాయికి తీసుకువస్తామని ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం 'పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్టనర్‌షిప్' (పీ–4) పథకం అమలుకు కిందా మీదా పడుతోంది. ఉగాది సందర్భంగా ఆర్భాటంగా మొదలైన ఈ పథకం.. సంపన్న వర్గాల నుంచి స్పందన లేకపోవడంతో ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. దీంతో ప్రభుత్వం సర్వేలు, పునఃపరిశీలనల పేరుతో కాలయాపన చేస్తోంది. మరోవైపు ఈ నెల 15వ తేదీలోగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వం ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తోంది. దీంతో జిల్లా స్థాయి అధికారులు దాతలను అన్వేషించాలని క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

ఆసక్తి చూపని సంపన్న వర్గాలు

సంపద సృష్టిస్తామని, పేదరికాన్ని రూపుమాపుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. 'సామాజిక బాధ్యత'అంటూ సంపన్నుల వెంటపడుతున్నారు. బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలని.. ఆ మేరకు పేద వర్గాలను దత్తత తీసుకోవాలని ప్రాధేయపడుతున్నారు.ఆ పిలుపునకు సంపన్న వర్గాలెవరూ ముందుకు రావడం లేదు. సీఎం పిలుపునకు ఆ పార్టీ నాయకులు కూడా స్పందించడం లేదు. కాగా.. ఈ పథకంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 73,452 బంగారు కుటుంబాలను నాలుగు దశల్లో గుర్తించి, పునఃపరిశీలన చేశారు. ప్రస్తుతం తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. వారికి మార్గనిర్దేశం చేసేందుకు 12 వేల మంది సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ప్రవాసాంధ్రులను గుర్తించారు. ఈ నెల 15వ తేదీ నాటికి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. గడువు సమీపిస్తుండటంతో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిడితో జిల్లా యంత్రాంగం తరచూ సమీక్షలు నిర్వహిస్తోంది. అయితే మేము ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్నాం అని కొందరు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని మరికొందరు, మాకు తెలిసిన పేదలకు చేతనైనంత సహాయం చేస్తున్నామని ఇంకొందరు సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదీ పథకం ఉద్దేశం

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను సమాజంలో స్థిరపడిన వారు దత్తత తీసుకుని విద్యా, ఆర్థిక, వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడటమే ఈ పథకం ఉద్దేశం. దత్తత అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఏ రూపంలోనైనా సహాయం అందించవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆయా రంగాల్లోని నిష్ణాతులు తమ పరిజ్ఞానాన్ని పంచడం, శిక్షణ ఇవ్వడం వంటివి చేయవచ్చు. పీ–4 పథకంలో చేరడం వల్ల ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని కూడా వివరిస్తున్నారు. కాగా.. మార్గదర్శుల గుర్తింపు ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల సహకారం తీసుకుంటున్నారు. ఈ నెల 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని, పెద్ద పరిశ్రమలు, ఆసుపత్రులు, ఉన్నత ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.

అధికారులపై తీవ్ర ఒత్తిడి

ఈ పథకంలో మార్గదర్శులను ఎంపిక చేసే ప్రక్రియలో మండల, జిల్లా స్థాయి అధికారులపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. కలెక్టర్ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ.. ఈ నెల 15వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. దీనికి తోడు ప్రతి గెజిటెడ్ అధికారి ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని సూచించడం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అధికారిక విధులు చూసుకోవాలో, ప్రభుత్వ లక్ష్యాల కోసం దాతల కోసం తిరగాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. చాలామంది అధికారులు ఈ బాధ్యతను కింది స్థాయి సిబ్బందికి అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దాతలను వెతకలేక కొందరు, పైఅధికారులతో చెప్పలేక మరికొందరు మానసిక వేదనకు గురవుతున్నారు.

ప్రభుత్వ వైఖరిపై మేధావుల ప్రశ్నలు

ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను తప్పించుకుని సంపన్నులపైకి నెడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల హక్కుగా ప్రభుత్వమే వారి సంక్షేమాన్ని నేరుగా చూడాలి. ఆ బాధ్యతను దాతలకు అప్పగించడం పేదల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. సంక్షేమ పథకాలను నూరు శాతం పారదర్శకంగా అమలు చేస్తే.. పీ–4 వంటి పథకాల అవసరమే ఉండదని వారు సూచిస్తున్నారు. మరొకరి ద్వారా సహాయం అందించడం పేదలను వారి దయాదాక్షిణ్యాలకు వదిలేయడమేనని, ఇది భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని ఫోన్లు రేపు 'రిటర్న్'

అంగన్‌వాడీల నిరసన బాట



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న మణి తదితరులు

ఎంవీపీకాలనీ: అంగన్‌వాడీలకు కేటాయించిన ఫోన్లు సరిగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిటు) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్యలపై యూనియన్ నాయకులు జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ రామలక్ష్మికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఫోన్లు నెమ్మదిగా పనిచేయడం, నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో యాప్‌లలో వివరాలు నమోదు చేయడం అసాధ్యంగా మారిందన్నారు. ఇది కార్యకర్తలపై పనిభారాన్ని పెంచుతోందని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, యాప్‌ల ద్వారా పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని, అలాగే వేతనాలు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూనియన్ నాయకులు విమర్శించారు. దీనికి నిరసనగా పనిచేయని ఫోన్‌లను సోమవారం సీడీపీవోలకు ఇచ్చేస్తామని పీడీకి స్పష్టం చేశారు. మంగళవారం నుంచి కేవలం రికార్డు వర్క్ మాత్రమే నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే నిరసనలు చేపడుతున్నట్లు యూనియన్ ప్రకటించింది. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పీడీ రామలక్ష్మి హామీ ఇచ్చారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, వెంకటలక్ష్మి, పద్మావతి, శోభారాణి, తులసి, ఈశ్వరమ్మ, ఇందిరా, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



మైనార్టీ నాయకులతో సమావేశమైన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీలు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మైనారిటీ(క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు)ల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో వివిధ మైనారిటీ వర్గాల నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నివసించే మైనారిటీల సమస్యలు తెలుసుకోవడం, వాటిపై చర్చించి తగిన పరిష్కారాలు కనుగొనడమే ఈ సమావేశ ప్రధాన ఉద్దేశమన్నారు. సమావేశంలో 60 మంది మైనారిటీ నాయకులతో సీపీ స్వయంగా చర్చించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మైనారిటీల మధ్య ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించుకోవడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సీపీ ప్రతిపాదించారు. దీంతో ఒక శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. అదే విధంగా ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి, మైనారిటీలు, పోలీసులు అందులో సభ్యులుగా ఉంటూ సమస్యలను పరస్పర సహకారంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సీపీ సూచించారు. సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, డి.మేరి ప్రశాంతి, మైనారిటీల నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతోనే వృత్తిలో రాణింపు

జస్టిస్ చీమలపాటి రవి



జస్టిస్ చీమలపాటి రవిని సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు, బార్ కౌన్సిల్ సభ్యులు

సబ్బవరం: క్రమశిక్షణ, వృత్తిపై అంకితభావంతో పని చేస్తేనే న్యాయవాద వృత్తిలో రాణించి.. ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల, మూడేళ్ల లా కోర్సుల్లో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులంతా గురువును దైవంగా భావిస్తూ, వినయం, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ తమ విద్యను కొనసాగించాలని సూచించారు. మంచి పౌరుడిగా ఉన్నప్పుడే మంచి న్యాయవాదిగా ఎదగగలరని అన్నారు. న్యాయవాద వృత్తిలో మొదటి తరం లాయర్లు, మూడు నుంచి నాలుగు తరాలుగా ఉన్నవారు కూడా ఉన్నారని, అందరూ ఒకే రకంగా శ్రమించినప్పుడే వృత్తిలో రాణించగలరని చెప్పారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సమాజంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టంపై కూడా అవగాహన ఉంటుందని తెలిపారు. చట్టంలో వచ్చే మార్పులను నిరంతరం అధ్యయనం చేస్తే వృత్తిలో రాణించవచ్చని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విశ్వవిద్యాలయంలోని సౌకర్యాలు, ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించి, వసతి గృహాలను సందర్శించారు. అక్కడ కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు నరసింగరావు, రామజోగేశ్వరరావు, వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమాన్ని నిర్బంధం చేయొద్దు



నినాదాలు చేస్తున్న టీచర్లు

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

బీచ్‌రోడ్డు: పీ4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయకూడదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆర్.అంబేద్కర్, ఏపీటీఎఫ్ 257 జిల్లా కార్యదర్శి టి.రామకృష్ణారావు, ఏపీటీఎఫ్ 1938 జిల్లా కార్యదర్శి ఆర్.వి.వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఈవో–1 పోస్టులను కామన్ సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతుల ద్వారా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. హైస్కూల్ ప్లస్‌ల్లో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగించాలని కోరారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టి కలెక్టర్ పూల్ ద్వారా పోస్టింగులు ఇవ్వాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మెమో నెంబర్ 57 సమాంతర మధ్యమం అమలు చేయాలన్నారు. కొత్తగా అప్‌గ్రేడ్ చేయబడిన పోస్టులను ఎంచుకున్న ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు సిహెచ్ కరుణాకర్, ఏపీటీఎఫ్ 1938 అధ్యక్షుడు టి.ధనుంజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ తొలి విడత పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీవీరాంజనేయ స్వామి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

గాజువాక: అన్నదాత సుఖీభవ మొదటి విడత సాయాన్ని జిల్లా రైతులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీవీరాంజనేయ స్వామి గాజువాకలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకం కింద వచ్చిన గ్రాంటుతో కలిపి మొత్తం రూ.20 వేల సాయాన్ని అందిస్తున్నామన్నారు. మొదటి విడత కింద జిల్లాలో 18,573 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. ఈ పథకం కింద గాజువాక నియోజకవర్గంలో 577 మంది రైతులు లబ్ధి పొందారని మంత్రి పేర్కొన్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవండి

జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అన్ని రకాల అవకాశాలు కల్పించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వారికి చేరువ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం జరిగిన జిల్లా విజిలెన్స్–మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అందించిన వివరాల ప్రకారం ప్రస్తుతం 147 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 695 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు నిర్దేశిత కాలంలో నష్ట పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిల్లో సివిల్ రైట్స్ డేలను నిర్వహించాలని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు తోడ్పాటు

జిల్లాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచించారు. శనివారం జరిగిన సఫాయి కర్మచారీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం రుణ సదుపాయం కల్పించాలని, గృహ నిర్మాణ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పని ప్రాంతాల్లో వారికి ప్రత్యేక వసతులు కల్పించాలని చెప్పారు. స్టీల్ ప్లాంట్, రైల్వే పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 28వ వార్డులోని కార్మికులకు జీతాలు చెల్లించలేదని కమిటీ సభ్యుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వివిధ విభాగాల అధికారులు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రాంబాబు, ఆంజనేయ, మాలతి తదితరులు పాల్గొన్నారు.

'గంధం' పూసిన కత్తిలా.. 8లో
కార్పొరేటర్ శ్రీనివాసరావు తీరుపై ఆగ్రహం

స్నేహానికి కొత్త అర్థం



అనాథ పిల్లల ఆశ్రమానికి కంప్యూటర్ అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు(ఫైల్)

భీమునిపట్నం: కాలం గడిచేకొద్దీ స్నేహితులు చెల్లాచెదురై.. ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడటం సర్వసాధారణం. కానీ.. భీమిలికి చెందిన కొందరు మిత్రులు మాత్రం తమ స్నేహాన్ని అపురూపంగా కాపాడుకోవడమే కాకుండా, దానిని సమాజ సేవకు వారధిగా మార్చారు. 'ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి(ఫ్యాబ్)' అనే సంస్థను స్థాపించి, గడిచిన పదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ, స్నేహానికి నిజమైన చిరునామాగా నిలుస్తున్నారు.

2014లో కాళ్ల సన్నీ అధ్యక్షతన.. తన స్నేహితులందరినీ కలుపుకుని ఈ 'ఫ్యాబ్' సంస్థకు అంకురార్పణ చేశారు. కేవలం కలుసుకుని ఆనందంగా గడపటమే కాకుండా, తమ చుట్టూ ఉన్న సమాజానికి, ముఖ్యంగా అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలన్న గొప్ప సంకల్పంతో 'ఫ్యాబ్' ప్రయాణం మొదలైంది.

విద్య, సమాజ సేవలో 'ఫ్యాబ్' ముద్ర

'ఫ్యాబ్' తమ సేవా కార్యక్రమాల్లో విద్య, నిరుపేదలకు అగ్రతాంబూలం ఇస్తోంది. పేద విద్యార్థుల చదువులకు, అనారోగ్యంతో బాధపడేవారికి అండగా నిలుస్తూ.. సంవత్సరానికి సుమారు రూ.5 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. తాము చదువుకున్న బడులను అభివృద్ధి పథంలో నడిపించడానికి 'ఫ్యాబ్' సభ్యులు ముందుకొచ్చారు. సెయింట్ ఆన్స్ స్కూల్‌కు స్మార్ట్ క్లాసుల కోసం రూ. 3 లక్షలతో ప్రొజెక్టర్‌ను, రూ.40 వేలతో సైకిల్ స్టాండ్‌ను బహూకరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శత వార్షికోత్సవం సందర్భంగా రూ.50 వేలతో వేదికను మరమ్మతు చేయించి, రూ.30వేల విలువైన ఫర్నీచర్‌ను గ్రంథాలయానికి అందించారు. తమ స్నేహితుల్లో ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లల వివాహాలకు సైతం సహాయం అందిస్తున్నారు. సామాజిక సేవతో పాటు భీమిలి పట్టణ సౌందర్యం, సంస్కృతిని ప్రోత్సహించడానికి కూడా 'ఫ్యాబ్' కృషి చేస్తోంది. గత మూడేళ్లుగా పర్యాటకులు, స్థానికులు సేద తీరడం కోసం బీచ్, పార్కులు వంటి పలు బహిరంగ ప్రదేశాల్లో రూ.8 లక్షల వ్యయంతో 100 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. భీమిలి అందాలు, చారిత్రక ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు రూ. 60 వేలతో 'జయహో భీమిలి' అనే వీడియో గీతాన్ని చిత్రీకరించారు. ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా విడుదలైన ఈ పాటకు విశేష ఆదరణ లభించింది. ఈ విధంగా 'ఫ్యాబ్'సభ్యులు తమ స్నేహాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా.. చేతలతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ, ఎందరికో స్ఫూర్తినిస్తున్నారు.


జయహో భీమిలి వీడియో పాటను ఆవిష్కరిస్తున్న నటుడు తనికెళ్ల భరణి(ఫైల్)


బాలికల చదువుకు ఆర్థిక సాయం(ఫైల్)

సేవే లక్ష్యంగా 'ఫ్యాబ్'

మాలోని పేద స్నేహితులతోపాటు అవసరాల్లో ఉన్న ఇతరులకు కూడా చేతనైన విధంగా సాయం చేయాలన్న లక్ష్యంతోనే ఈ 'ఫ్యాబ్'ను స్థాపించాం. అంతేకాకుండా ఆ దిశగా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో ఉన్న ప్రతి ఒక్కరం బాధ్యతగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తున్నాం. దీన్ని ఇలాగే కొనసాగిస్తూ మరిన్ని సేవలు అందించాలన్నదే మా కోరిక.

– కాళ్ల సన్నీ, ఫ్యాబ్ వ్యవస్థాపకుడు, భీమిలి

హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే

ముదిమిలో వికసించిన స్నేహ కుసుమాలు

అల్లిపురం: జీవితంలో అత్యంత విలువైన బంధాల్లో స్నేహం ఒకటి. కష్టసుఖాల్లో తోడునీడగా నిలిచి, సంతోషాన్ని పంచుతూ, మనకు అండగా నిలిచే స్నేహితులు దొరకడం ఒక వరం. వయసుతో సంబంధం లేకుండా, బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు స్నేహ భావం ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. వయసు మళ్లినప్పటికీ స్నేహంతో పరిమళిస్తున్న కొందరి జీవితాల్లోకి ఓ సారి తొంగిచూద్దాం. బంగారుమెట్టలోని శ్రీ రామాంధ్ర యువజన సమాజం ప్రాంగణం ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఒక చక్కటి స్నేహ కలయికకు వేదికవుతుంది. ఉద్యోగ విరమణ చేసి, బాధ్యతలు తీర్చుకున్న కొందరు పెద్దలు ఇక్కడ సమావేశమవుతారు. వారి మధ్య కబుర్లు కేవలం కాలక్షేపం కోసం కాదు.. అవి వారి జీవితాల్లో భాగమైపోయాయి. తమ కుటుంబ విషయాలు, వ్యక్తిగత ఆనందాలు, బాధలను ఒకరికొకరు పంచుకుంటూ మానసిక సాంత్వన పొందుతున్నారు.


బంగారుమెట్టలోని శ్రీ రామాంధ్ర యువజన సమాజం వద్ద ఒక్క చోటకు చేరిన స్నేహితులు

ఒకరికొకరు తోడుగా..

వారి స్నేహం కేవలం మాటలకే పరిమితం కాదు. పెళ్లి, సత్కారం వంటి శుభకార్యమైనా, కష్టం, నష్టం వంటి బాధాకరమైన సంఘటనైనా అందరూ కలిసికట్టుగా హాజరవుతారు. ఒకరికొకరు అండగా నిలవడమే కాకుండా, ఆర్థికంగా కూడా చేదోడువాదోడుగా ఉంటారు. వారిలో ఎవరైనా ఒకరు రాకపోతే, వెంటనే ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుంటారు. అవసరమైతే వారి ఇంటికి వెళ్లి, సహాయం చేయడానికి కూడా వెనుకాడరు. ఇంకా వారి మాటల్లో చెప్పాలంటే.. 'అమ్మ ప్రేమ తర్వాత జీవితంలో అంతటి ప్రాధాన్యత స్నేహానికే ఉంది. ఇంట్లో చెప్పుకోలేని కొన్ని సమస్యలను కూడా మిత్రులతో పంచుకుంటే మనసు తేలికపడుతుంది. ఈ వయసులో మాకు ఈ స్నేహమే పెద్ద ఆధారం.' అని అంటారు. ఈ బృందం, స్నేహానికి వయసు అడ్డుకాదని, అది జీవితంలోని ప్రతి దశలోనూ ఆనందాన్ని, భరోసాను ఇస్తుందని నిరూపిస్తున్నారు.

ప్రతిరోజూ కలుసుకుంటాం



మేమంతా వేర్వేరు కార్యాలయాల్లో పనిచేసి పదవీ విరమణ పొందినవాళ్లం. అలాగే కొంతమంది వ్యాపారాలు చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే అందరం ప్రతి రోజూ కలుసుకుంటాం. ఒకరి కష్టసుఖాలను మరొకరం పంచుకుంటూ సరదాగా గడుపుతాం. ఇక్కడ కూర్చున్నంతసేపు మాకు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఈ స్నేహాన్ని ఇలాగే కొనసాగిస్తాం.

– భీశెట్టి హనుమంతరావు, ఎంఈఎస్ విశ్రాంత ఉద్యోగి

స్నేహితులే నా సంతోషం



ప్రతి రోజూ ఇక్కడికి వస్తుంటాను. ఒక్కరోజు నా స్నేహితులను కలుసుకోకపోతే.. ఆ రోజు ఏదో వెలితిగా ఉంటుంది. గతంలో పాల వ్యాపారం చేసేవాడిని. ఇప్పుడు మానేశాను. అందరితో మాట్లాడితే ఎంతో సంతోషంగా ఉంటుంది.

– భీమరశెట్టి అప్పారావు, బంగారుమెట్ట

స్నేహబంధమే మా బలం



ఎవరికి కష్టం వచ్చినా కుటుంబ సభ్యుల్లా కలిసిపోయి వారికి అండగా నిలుస్తాం. నేను నేవల్ డాక్‌యార్డ్‌లో పనిచేసి పదవీ విరమణ పొందాను. స్నేహంలో ఉన్న ఆనందం మరెందులోనూ ఉండదు. ఉదయం, సాయంత్రం తప్పకుండా కలుసుకుంటాం. ఒకవేళ కలుసుకోకపోతే ఆ రోజు ఏదో వెలితిగా ఉంటుంది.

– మద్దాల వెంకట అప్పారావు, రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి

స్నేహితులంటే ధైర్యం



స్నేహితులు చెంతనుంటే ఆ ధైర్యమే వేరు. వారితో మన అభిప్రాయాలు పంచుకుంటే మనసుకు ప్రశాంతంగా ఉంటుంది. స్నేహితులను కలుసుకోకపోతే ఆ రోజు ఏదోలా ఉంటుంది. స్నేహితులు తోడుంటే ఎంత దూరమైనా వెళ్లవచ్చు.

– మజ్జి సూర్యనారాయణ, ఎంఈఎస్ రిటైర్డ్ ఉద్యోగి

ఇచ్చిపుచ్చుకోవడమే స్నేహం



కష్ట సుఖాలైనా, ఏదైనా సరే ఒకరికొకరు పంచుకోవడమే స్నేహం. నేను ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడిని. వయసు మీదపడటంతో ఆ పనులు మానేశాను. ప్రతి రోజూ కొంత సమయం క్లబ్ వద్ద స్నేహితులతో గడుపుతాను. దీని వల్ల నాకు మానసిక ప్రశాంతత లభిస్తుంది.

– ఆదారి కృష్ణారావు, అల్లిపురం

16 స్వీట్ షాపులపై కేసుల నమోదు

పాడైపోయిన ఆహార పదార్థాల విక్రయం

బీచ్‌రోడ్డు: నగరంలో వరుసగా రెండో రోజు కూడా ఆహార భద్రత, లీగ్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిల్వ ఉంచిన, పాడైపోయిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్న 16 స్వీట్ అండ్ బేకరీ షాపులపై కేసులు నమోదు చేశారు. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 20 బృందాలు శనివారం ఏకకాలంలో 40 స్వీట్స్ అండ్ బేకరీ షాపుల్లో తనిఖీలు చేపట్టాయి. ఆయా షాపుల్లో 39 రకాల ఆహార పదార్థాల నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం పంపించారు. పరిశుభ్రత పాటించని 10 షాపులకు నోటీసులు జారీ చేశారు. పరీక్షల నిమిత్తం పంపిన నమూనాల ఫలితాలు వచ్చాక, ఏమైనా తేడాలుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పూర్ణచంద్రరావు హెచ్చరించారు. ఈ తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించడానికి ఇతర జిల్లాల నుంచి కూడా అధికారులను రప్పించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.


స్వాధీనం చేసుకున్న పాడైన ఆహార పదార్థాలు

ఏయూ మహిళా హాస్టల్‌లో పాము

తాటిచెట్లపాలెం: ఏయూ మహిళా వసతి గృహంలోకి శనివారం రాత్రి 10 గంటల సమయంలో పాము ప్రవేశించింది. ఇది గుర్తించిన విద్యార్థినులు వెంటనే జీవీఎంసీకి సమాచారం ఇవ్వడంతో స్నేక్‌క్యాచర్ వచ్చి పామును పట్టుకున్నాడు. హాస్టల్‌లో శానిటేషన్ సరిగా లేకపోవడంతో ఎలుకలు గోడలకు భారీగా రంధ్రాలు చేయడం వల్ల పాములోపలకు వచ్చినట్లు హాస్టల్ విద్యార్థినులు వాపోయారు. రాత్రి సమయంలో పాము రావడంతో విద్యార్థినులు నిద్రపోవడానికి భయపడుతున్నారు.


ఏయూ హాస్టల్‌లో ప్రవేశించిన పాము

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

- స్పాట్ రిజిస్ట్రేషన్‌కు రేపటి వరకు గడువు
- 5వ తేదీన సీట్ల భర్తీ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు స్పాట్ అడ్మిషన్లకు కాలేజీల్లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అర్హులైనవారికి ఈనెల 5వ తేదీన సీట్లు కేటాయిస్తారు.

నిబంధనలు ఇవీ..

స్పాట్ అడ్మిషన్లు కావాల్సిన వారు ఇంతవరకు ఏ కాలేజీలోనూ చేరి ఉండకూడదు. వీరు సీటు పొందిన వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ కాలేజీల్లో రూ.4,700, ప్రైవేటు కాలేజీల్లో రూ.25,000 ఫీజు స్పాట్‌లో చెల్లించాలి. సీట్ల భర్తీలో రిజర్వేషన్లు పాటిస్తారు.పాలిసెట్‌లో ర్యాంకర్లకు మొదటి ప్రాధాన్యత, పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులకు రెండో ప్రాధాన్యత, సప్లిమెంటరీలో పాసైన వారికి మూడో ప్రాధాన్యత ఇస్తారు.

–స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించవని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ తెలిపారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జెరాక్స్ కాపీలు, ఫీజు తీసుకురావాలన్నారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ సీట్లు వేరే కేటగిరిలో మార్పు చేసే అవకాశం లేదని, ఎస్‌వీ యూనివర్సిటీకి రిజర్వు చేసిన సీట్లను ఏయూ రీజియన్‌కు ఇవ్వడం కుదరదన్నారు. ప్రైవేటు కాలేజీల్లో కేటగిరీల వారి ఖాళీలను తెలుసుకుని నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

ఇవీ ఖాళీలు

- పాలిటెక్నిక్ కాలేజీలో మెటలర్జీలో 7, సివిల్ ఇంజినీరింగ్‌లో 4 సీట్లు ఖాళీలు ఉన్నాయి. మెటలర్జీలో ఈడబ్ల్యూఎస్‌కు 3, బీసీ–ఏ కేటగిరీకి 2, బీసీ–ఈకి 1, ఎస్సీ–3 కేటగిరికి ఒక సీటు కేటాయించారు. సివిల్ ఇంజినీరింగ్‌లో బీసీ డీ జనరల్‌కు 1, ఓసీ–జనరల్‌కు కలిపి 1, ఎస్సీ –3 పీబ్ల్యూడీకి 1 సీటు రిజర్వు చేశారు.
- కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్‌లో ఈడబ్ల్యూఎస్ జనరల్ విభాగంలో ఒక సీటు ఎస్‌వీ యూనివర్సిటీ రీజియన్‌కు, ఒక సీటు ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్‌కు కేటాయించారు. ఆయిల్ టెక్నాలజీలో ఎస్‌వీ యూనివర్సిటీ ప్రాంతానికి ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఒక సీటు, ఏయూ రీజియన్ విద్యార్థులకు బీసీ డీ జనరల్, ఓసీ జనరల్‌కు ఒక్కొక్కటి చొప్పున రిజర్వు చేశారు. కెమికల్ ఇంజినీరింగ్‌లో ఎస్సీ–3 జనరల్ కేటగిరికి ఒక సీటు ఖాళీగా ఉంది.

'గంధం' పూసిన కత్తిలా..

- కార్పొరేటర్ శ్రీనివాసరావు తీరుపై ఆగ్రహం
- మా కడుపు కొట్టారంటూ బాధితుల ఆందోళన
- కార్పొరేటర్‌ను నిలదీసిన దుకాణదారులు


గోడను కూలగొట్టడంతో నుజ్జయిన స్కూటీ

పెదగంట్యాడ: మండలంలోని 76వ వార్డు గాంధీనగర్ ఆర్చ్ వద్ద, చిన నడుపూరు నూకాంబిక ఆలయం వెనుక ఉన్న ఆక్రమణల తొలగింపు శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా జీవీఎంసీ అధికారులు దుకాణాలను కూల్చివేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈ తొలగింపు వెనుక 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు హస్తం ఉందని బాధితులు ఆరోపించారు. 30 ఏళ్లుగా ఇక్కడ దుకాణాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఒక్కసారిగా తమ దుకాణాలను తొలగించడం వల్ల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఎప్పటి నుంచో ఈ ప్రాంతంపై కన్నేసి, తమ దుకాణాలను తొలగించి, అక్కడ కొత్త షాపులు నిర్మించుకోవాలని చూస్తున్నారని బాధితులు ఆరోపించారు. గతంలో కూడా ఇక్కడ దుకాణ సముదాయం నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయని, శిలాఫలకం కూడా సిద్ధం చేసి నిర్మాణాలను ప్రారంభించాలనుకున్నారని, అయితే అప్పట్లో జీవీఎంసీ అధికారులు జోక్యం చేసుకుని అడ్డుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మళ్లీ ఇక్కడ దుకాణ సముదాయం నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారని, దీని కోసం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో భూమి పూజ కూడా చేయించారని బాధితులు ఆరోపించారు. ఇప్పుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ దుకాణాలను నేలమట్టం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కార్పొరేటర్ మాత్రం ఏమీ తెలియనట్టు పెద్దమనిషిలా వచ్చారని ధ్వజమెత్తారు.


కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుతో దుకాణదారుల వాగ్వాదం

కార్పొరేటర్‌కు నిరసన సెగ

తమ దుకాణాలను తొలగించడంతో ఆగ్రహంతో ఊగిపోయిన బాధితులు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావును నిలదీశారు. 'మీ కడుపు నింపుకోవడం కోసం మా పొట్టలు కొడతారా?' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిందంతా చేసి, ఇప్పుడు పెద్దమనిషి తరహాలో వచ్చి తమకు నచ్చజెప్పాలని చూస్తున్నారా అంటూ స్థానికులు ఒక్కసారిగా వాగ్వాదానికి దిగడంతో, చేసేదేమీ లేక కార్పొరేటర్ అక్కడి నుంచి వెనుదిరిగారు.

149 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

దాబాగార్డెన్స్: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి పురస్కరించుకొని నగర వీధుల్లో 149 అడుగుల భారీ జాతీయ జెండాను శనివారం ప్రదర్శించారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాతనగరం నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ దరి రాణి బొమ్మ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్లమెంట్‌లో వెంకయ్య విగ్రహాన్ని ప్రతిష్టించడంతో భారతరత్న బిరుదు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో టి.కృష్ణ, సీహెచ్ నూకరాజు, సీమెన్ భాష పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న నగరప్రజలు

చెస్ పోటీల విజేతలు తనీష్, మనస్వి

విశాఖ స్పోర్ట్స్: అండర్–19 జిల్లా చదరంగం పోటీల్లో ఓపెన్ విభాగంలో తనీష్, బాలికల విభాగంలో మనస్వి విజేతలుగా నిలిచారు. ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో సమత డిగ్రీ కళాశాలలో శనివారం ఈ పోటీలు జరిగాయి. ఓపెన్ విభాగంలో 70 మంది క్రీడాకారులు ఏడు రౌండ్లలో పోటీ పడ్డారు. ఇందులో ఆరు పాయింట్లు సాధించిన సి.హెచ్.తనీష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆరు పాయింట్లు సాధించినప్పటికీ టైబ్రేక్‌లో వెనుకబడిన రమణ సిద్ధార్థ్, వి.వెంకటేశ్వర్లు ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. 5.5 పాయింట్లతో వరుణ్‌రాజ్ నాలుగో స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో 26 మంది క్రీడాకారిణులు ఐదు రౌండ్లలో తలపడ్డారు. ఇందులో 4.5 పాయింట్లతో ఎం.మనస్వి విజేతగా నిలిచింది. నాలుగు పాయింట్లు సాధించిన శ్రీనందన, షరీన్, సాయిదీప్తి తర్వాత మూడు స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఆగస్టు 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని సంఘం కార్యదర్శి మణికంఠ తెలిపారు.

విశాఖ పీస్ కమిటీ చైర్మన్‌గా ఫాదర్ అనిల్ పాల్

అల్లిపురం: విశాఖ పీస్ కమిటీ చైర్మన్‌గా ఫాదర్ అనిల్ పాల్, కో–చైర్మన్‌గా న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ ఎంపిక చేశారు. శనివారం పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను సిక్కు ప్రతినిధి సతీందర్ సింగ్ సేథీ, జైనుల ప్రతినిధి, ప్రముఖ వ్యాపారి కమల్‌బేద్ చేయగా, వివిధ మతాల ప్రతినిధులు తమ సమ్మతిని తెలిపారు. ఈ సందర్భంగా సీపీ, డీసీపీలు, ఫాదర్ అనిల్ పాల్, న్యాయవాది ఐ.ఎం. అహ్మద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆటో మ్యుటేషన్ ప్రక్రియ సజావుగా సాగాలి

దాబాగార్డెన్స్: ఆస్తుల రిజిస్ట్రేషన్‌తో పాటు ఆటో మ్యుటేషన్ ప్రక్రియ ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా సజావుగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు.ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆయన రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ బాలకృష్ణ, జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుతో కలిసి శనివారం పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు సూపర్‌బజార్ ప్రాంగణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను, ప్రత్యేకించి ఆటో మ్యుటేషన్ అమలును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో మ్యుటేషన్ ప్రక్రియలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) లేదా సంబంధిత జోనల్ కమిషనర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సబ్–రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో కమిషనర్ మాట్లాడుతూ ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలోనే ఇంటి పన్ను పేరు మార్పు ప్రక్రియ పూర్తవుతుందని, దీని కోసం జీవీఎంసీ కార్యాలయాలకు ప్రత్యేకంగా వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రజలు ఈ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆటో మ్యుటేషన్ ప్రక్రియను తరచుగా పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లకు కమిషనర్ సూచించారు. త్వరలో మరో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కూడా సందర్శించి ఈ ప్రక్రియను పరిశీలిస్తానని కమిషనర్ పేర్కొన్నారు.